క్లుప్తంగా

సిమెంట్ బెంచీల అందజేత

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాసంస్థల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావాలని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో 1975–78లో డిగ్రీ చదివిన న్యాయవాది, ట్యాక్స్ ప్రాక్టీషనర్ శనగ ప్రకాష్‌రెడ్డి కళాశాల క్రీడా మైదానానికి సిమెంట్ బెంచీలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి ప్రకాష్‌రెడ్డి దాతృత్వాన్ని కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు పోలిశెట్టి జ్ఞానదేవ్, కార్యదర్శి చక్కా అధిపతిరావు, ఉపాధ్యక్షుడు మద్ది రాధాకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ ఆర్. శివాజీ, వైస్ ప్రిన్సిపాల్ భాను మురళీధర్, శనగ ప్రమీలకుమారి పాల్గొన్నారు.

రైల్వే సీనియర్ డీఓఎం దినేష్ కుమార్ రిలీవ్

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని సీనియర్ డీఓఎంగా విధులు నిర్వహిస్తున్న ఎం.దినేష్‌కుమార్ బుధవారం రిలీవ్ అయ్యారు. ఇటీవల రైల్వే బోర్డు విజయవాడ డివిజన్‌కు బదిలీ చేసింది. అక్కడ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా డివిజన్ సిబ్బంది, అధికారులు ఘనంగా సన్మానించారు.

పన్ను బకాయిలు చెల్లించకుంటే చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



నెహ్రూనగర్‌లో డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు సకాలంలో పన్నులు చెల్లించని కమర్షియల్ సంస్థలను సీజ్ చేయడం, నివాసాలకు ట్యాప్ కనెక్షన్‌లు తొలగిస్తామని, అప్పటికీ చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు మిర్చి యార్డు, నల్లపాడు రోడ్, శ్యామల నగర్, స్తంభాల గరువు, హనుమయ్య నగర్, నల్లచెరువు, ఎల్‌ఆర్ గాంధీ నగర్, స్వర్ణాంధ్ర నగర్ తదితర ప్రాంతాల్లో కమర్షియల్ సంస్థ సీజ్, ఇతర నివాసాలకు మున్సిపల్ ట్యాప్ కనెక్షన్‌ని రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ సిబ్బంది తొలగించారు. పన్ను చెల్లించకుండా నిర్లక్ష్యంగా ఉండే వారికి జీఎంసీ నుంచి అందించే మున్సిపల్ ట్యాప్ కనెక్షన్, డ్రెయినేజీ కనెక్షన్ తొలగించడంతో పాటు విద్యుత్ కనెక్షన్ తొలగింపునకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

పిన్ పాయింట్ ప్రకారం పారిశుద్ధ్య పనులు..

నగరంలో మెరుగైన పారిశుద్ధ్యం కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు సకాలంలో విధులకు హాజరై పారిశుద్ధ్య పనులను పిన్ పాయింట్ ప్రకారం జరిగేలా పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. బుధవారం పాల ఆస్పత్రి దగ్గర మస్టర్ పాయింట్, నెహ్రూనగర్, మోతీలాల్ నగర్, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పర్యటనలో కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ, సీఎంహెచ్‌ఓ డాక్టర్ అమృతం, డీఈఈ కళ్యాణరావు పాల్గొన్నారు. నగరంలో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రధాన రహదారుల విస్తరణ పనులు వేగంగా చేస్తున్నామని, మూడు వంతెనల వద్ద నుంచి శారదా కాలనీ రోడ్ విస్తరణ పనులు కూడా ప్రారంభించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మూడు వంతెనల నుంచి శారదాకాలనీ వరకు చేపట్టాల్సిన రోడ్ విస్తరణ పనుల మార్కింగ్‌ని పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు.

నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: యువత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రమా జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన స్ఫూర్తి ది ఐక్యూబ్ ఎక్స్‌పో బుధవారం ముగిసింది. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు వారిలోని ప్రతిభకు అద్దం పట్టాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ప్రదర్శన ద్వారా విద్యార్థులకు పరిశ్రమలతో ప్రత్యక్షంగా సంబంధాలు ఏర్పడ్డాయని, భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈసందర్భంగా ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ మధ్య నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన హరితం, కృత్రిమ మేధ, అవయవదానం-రక్తదానం స్టాల్స్ వరుసగా తొలి మూడుస్థానాల్లో రూ.ఐదువేలు, రూ.3,500, రూ.2,500 నగదు బహుమతులు గెలుపొందాయి. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అకడమిక్ నిపుణులు, ఎంబీఏ, ఎంసీఏ విభాగాధిపతులు వి.చక్రవర్తి, డి.రాజ్యలక్ష్మి, స్ఫూర్తి కన్వీనర్ కె.లలిత, కో-కన్వీనర్ ఎ.బాజీబాబు, అడ్మిన్ డైరెక్టర్ కళ్యాణి, సహాయాచార్యులు వైష్ణవి, వేదవతి, అభిలాష్, అనిత, రాజరాజేశ్వరీదేవి, శశికళ పాల్గొన్నారు.

కఠోర శ్రమతోనే ఉన్నత విజయాలు సాధ్యం

భాష్యం వార్షికోత్సవ వేడుకలో వక్తలు



గుంటూరు ఎడ్యుకేషన్: కఠోర శ్రమతో ఉన్నత విజయాలు అందుకోవచ్చునని ప్రముఖ వైద్యురాలు స్వప్న శ్రీనాథ్ అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో మార్కెట్ సెంటర్‌లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉడాన్ పేరుతో మూడు రోజుల పాటు గుంటూరు అర్బన్ జోన్-2(నగరాలు, పట్టాభిపురం, ఆర్టీసీ కాలనీ, ఎఎస్వీఎస్ కాలనీ, సాంబశివపేట) వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ స్వప్నశ్రీనాథ్ మాట్లాడారు. కార్యక్రమంలో సాంబశివపేట భాష్యం బ్రాంచి పూర్వ విద్యార్థి డాక్టర్ ప్రసన్నజ్యోతి, గుంటూరు అర్బన్ జోన్-2 జెడ్‌ఓ స్వప్న, భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే దేశానికి శ్రీరామరక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళా సాధికారత ద్వారా దేశానికి శ్రీరామరక్షగా నిలుస్తారని రోటరీ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్ రవి వడ్లమాని పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల సమావేశ మందిరంలో బుధవారం కళాశాల మహిళా సాధికారత విభాగ సహకారంతో అడ్వాన్స్‌డ్ సైకలాజికల్ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఏ) ఇండియా, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న డాక్టర్ నీలిమ, డాక్టర్ ఎస్.హసీనా, డాక్టర్ పి.నీరజ, డాక్టర్ పి.శిరీష రాణి, డాక్టర్ షబానా అజ్మీ, కాపు శ్యామలను సత్కరించి కె.నిరంజన్‌రెడ్డి మెమోరియల్ అవార్డులను అందజేశారు.

వెటర్నరీ విద్యార్థులపై కక్ష సాధింపు తగదు

లక్ష్మీపురం: సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తున్న వెటర్నరీ విద్యార్థులపై వేధింపులు తగదని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా ఆందోళన చేస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 2013 నుంచి వెటర్నరీ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే స్టైఫండ్ నెలకు కేవలం రూ.7 వేలు, పీజీలకు రూ.9 వేలు, పి.హెచ్.డిలకు రూ.10 వేలు ఇస్తున్నారని తెలిపారు. మెడికల్ విద్యార్థులకు మాత్రం నెలకు రూ.25 వేలకు పైగా చెల్లిస్తున్నారని, పశు వైద్య విద్యార్థులకు వైద్యరంగంలోని విద్యార్థులకు స్టైఫండ్‌లో అత్యధిక వ్యత్యాసం చూపడం సరికాదని చెప్పారు. ఈనేపథ్యంలో నిరసన దీక్షలు చేస్తున్న విద్యార్థులను హాస్టల్స్‌లో ఉండడానికి వీలులేదని ఉత్తర్వులు ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు. తక్షణమే యూనివర్సిటీ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్, అజయ్, చందు, అమీర్, సాయి గణేష్, జయంత్ పాల్గొన్నారు.

'తులసి'లో జాతీయ భద్రతా దినోత్సవం



కొరిటెపాడు(గుంటూరు): జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా ఫిరంగిపురం మండలం, అమీనాబాద్‌లోని తులసి సీడ్స్ ఫ్యాక్టరీ ఆవరణలో బుధవారం భద్రతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తులసి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ భద్రత పతాకాన్ని ఆవిష్కరించి, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సహజంగా కర్మాగారాల్లో జరిగే ప్రమాదాలు ఎలా ఉంటాయి, వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలి అనే అంశంపై ప్రదర్శన రూపంలో కార్మికులకు ఈ సందర్భంగా యోగీష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేట్ హెచ్‌ఆర్ వడ్లమూడి రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

సామూహిక తులసి పూజలు

నగరంపాలెం: స్థానిక మారుతినగర్‌లోని శ్రీకంచి కామకోటి పీఠ శ్రీమారుతి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తోన్న వార్షిక బ్రహ్మోత్సవాలు నాలుగో రోజుకి చేరాయి. బుధవారం బాల పూజ నిర్వహించారు. అనంతరం సామూహిక తులసి పూజలు, శ్రీమల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి శాంతి సామూహిక కళ్యాణ మహోత్సవం వైభవంగా చేపట్టారు. సాయంత్రం శ్రీచండీ హోమం జరిగింది.

హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్‌లో పనిచేసే హమాలీ కార్మికులను ప్రభుత్వ నాలుగోవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



నగరంపాలెం: విధులు నిర్వర్తించే మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా పోలీస్ కళ్యాణ మండపంలో పోలీస్ విభాగ మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ అధికారిణి దీక్ష, జిల్లా ఏఎస్పీ(ఏఆర్) హనుమంతు, డీఎస్పీలు సుబ్బారావు(మహిళా పీఎస్), బానోదయ(దక్షిణ), ఆర్ఐ శ్రీహరి రెడ్డి, పోలీస్ యూనిట్ ఆసుపత్రి వైద్యురాలు ఎస్తేరు రాణి, ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ వైద్యులు అన్వేష్‌కుమార్, రాజశేఖర్, హిమబిందు, శిరీష, తేజశ్రీ, కిమ్స్ హాస్పిటల్ వైద్యురాలు టి.మహతి, మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్ వైద్యులు వంశీ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుకు ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసిన అప్సా ప్రతినిధులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా అప్సా రాష్ట్ర చైర్మన్ మేకల రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలబోర్డు పెట్టిన చోట కార్పొరేషన్ అధికారులు రూ.మూడువేలు జరిమానా విధిస్తున్నారని, శానిటరీ ఎన్‌ఓసీ పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అప్సా కార్యదర్శి వంగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు వెలిశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు మురళి, గుంటూరు తూర్పు, పశ్చిమ అధ్యక్షులు భానుప్రసాద్, వెంకట్రావు ఉన్నారు.

తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక దాడి

నగరంపాలెం: తొమ్మిదేళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన బాలుడ్ని కొత్తపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. మోతీలాల్‌నగర్‌లో ఉంటున్న తొమ్మిదేళ్ల బాలిక నాలుగో తరగతి చదువుతోంది. మూడు రోజుల క్రితం ఇంటి సమీపంలోని స్నేహితుల వద్దకెళ్లింది. ఈ క్రమంలో తాపీ పనులకు వెళ్లే బాలుడు బాలికను ఇంట్లోకి పిలిచి దాడికి ఒడిగట్టాడు. అయితే బాలికకు కడుపు నొప్పిగా ఉండటంతో కుటుంబ సభ్యులు జీజీహెచ్‌లో చికిత్స చేయించారు. దీనిపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలుడ్ని అరెస్ట్ చేయగా, బుధవారం కోర్టులో హాజరుపరిచారు.

జన ఔషధాలతో ఆరోగ్య సంరక్షణ ఖర్చుల్లో తగ్గుదల

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన జన ఔషధాలతో ఆరోగ్య సంరక్షణకు చేస్తున్న ఖర్చులు గణనీయంగా తగ్గాయని మంగళగిరిలోని ఎయిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ శ్రీమంత్ కుమార్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం పీఎం మోదీ ప్రారంభించిన జన ఔషధి వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిమ్స్ డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమ్యజ్యోతి, జన ఔషధి నోడల్ అధికారి ఎ.హరికృష్ణ, కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు పాల్గొన్నారు.

ఐసీసీలో పెరిగిన సభ్యత్వ నమోదు

శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు



నగరంపాలెం: ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్(ఐసీసీ) సభ్యత్వ నమోదుపై ఇతరత్రా అంశాలపై ఇటీవల క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు మాట్లాడటం సరికాదని ఐసీసీ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు అన్నారు. జిన్నా టవర్ కూడలిలోని ఐసీసీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఐసీసీ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన యేల్చూరి వెంకటేశ్వర్లకు ఈనెల రెండో తేదీన జరిగిన ఆత్మీయ సత్కార సభలో గ్రంధి కాంతారావు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఏ ఆలోచనతో మాట్లాడుతున్నారనేది అర్థం కావడంలేదని అన్నారు. 1999లో 300 మందికి సభ్యత్వం ఉందని, ప్రస్తుతం 3,020 మందికి సభ్యత్వం ఉందని పేర్కొన్నారు. ఐసీసీకి 65 అనుబంధ సంస్థలు ఉన్నాయని తెలిపారు. ఇటీవల జరిగిన ఐసీసీ ఎన్నికల వేళ ఎక్కువ ఓటర్లు లిఫ్ట్‌ను వినియోగించడంతో మొరాయించగా, వెంటనే మరమ్మతులు చేయించి వాడుకంలోకి తెచ్చామని చెప్పారు. దానిపై కూడా అనవసరమైన వ్యాఖ్యాలు చేశారని అన్నారు. ప్రస్తుతం ఐసీసీకి రూ.1.50 కోట్ల డిపాజిట్ ఉందన్నారు. వంద మందికి ఉపకార వేతనాలు పంపిణీ చేశామని అన్నారు. వ్యాపారులు ఎదుర్కొన్న అనేక సమస్యలకు పరిష్కారం చూపామని చెప్పారు. ఆంజనేయులు అనారోగ్యంగా ఉన్నారని, నడవలేకపోవడం వల్లే ఎన్నికలు జరిగాయని మాట్లాడటం సరికాదన్నారు. గతేడాది కూడా తానే ఎన్నికల్లో పోటీ చేసి గెలిచానని గుర్తుచేశారు. ఐసీసీకి ఏ పార్టీతో సంబంధంలేదని, అన్ని పార్టీలతో కలిసి ఉంటుందని చెప్పారు. ఉపాధ్యక్షులు కొప్పురావూరి ఏడుకొండలు, ఆతుకూరి నగేష్, టీఎల్‌వీ వీరాంజనేయులు, నాగిరెడ్డి, ఈసీ సభ్యులు కోట రాజేంద్రప్రసాద్, ఆతుకూరి వీరాంజనేయులు, అమర శ్రీనివాసరావు, మొగిలి సతీష్‌కుమార్, కొత్తమాసు శ్రీనివాసరావు, మాజీ కార్యదర్శి అన్నా పూర్ణచంద్రరావు, గోరంట్ల వెంకటేశ్వరస్వామి గుడి కార్యదర్శి మేడా సాంబశివరావు పాల్గొన్నారు.